క్లుప్తంగా

ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సాయం అందజేస్తున్న విద్యార్థులు

రణస్థలం: మండలంలోని నెలివాడ గ్రామానికి చెందిన ఎందువ అప్పలనాయుడు కుమారుడు ఎందువ కీర్తివర్ధన్ బ్రెయిన్ ట్యూమర్‌తో బాధ పడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న ఆదర్శ పాఠశాల విద్యార్థులు స్పందించి విరాళంగా సేకరించిన రూ.30 వేల ఆర్థిక సాయం కుటుంబ సభ్యులకు బుధవారం అందజేశారు. విద్యార్థులంతా పెద్ద మనసుతో ఆదుకోవడంపై ప్రిన్సిపాల్ పి.శ్రీధర్ హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అంతర పంటల పరిశీలన



అంతర పంటలను పరిశీలిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని సిలగాం సింగువలసలో రబీ అంతర పంటలు పెసర, మినుములు, ఉలవలు, వేరుశనగను మండల వ్యవసాయాధికారి ఎం.ఉషాకుమారి బుధవారం పరిశీలించారు. సాగులో ఉన్న పంటలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు.

కేజీబీవీ విద్యార్థులకు అవార్డులు



విద్యార్థినులను అభినందిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

ఎచ్చెర్ల: శ్రీకాకుళంలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ నిర్వహించిన బేటీ బచావో, బేటీ పడావో కార్యక్రమంలో 25 కేజీబీవీ పాఠశాలల నుంచి పది మంది విద్యార్థినులను ఛాంపియన్ షిప్ అవార్డులకు ఎంపిక చేశారు. దీనిలో లావేరు మండలంలోని మురపాక కేజీబీవీలో పదో తరగతి చదువుకున్న ముగ్గురు విద్యార్థినులు శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ చేతులమీదుగా అవార్డులు అందుకున్నారు. పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించినందుకు జె.షణ్ముఖప్రియ, గొర్లె చందన, పిసిని పావనిలకు అవార్డులు అందించారని ప్రిన్సిపాల్ సుధారాణి తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న ఐసీడీఎస్ అధికారులు విద్యార్థినులను అభినందించారు.

మహిళా సంఘాలకు ప్రత్యేక రుణాలు



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మి

జి.సిగడాం: గ్రామాల్లోని అర్హులైన మహిళా సంఘాలకు బ్యాంకు ద్వారా ప్రత్యేక రుణాలను మంజూరు చేసేందుకు కృషి చేస్తున్నామని మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు చిర్రా లక్ష్మి అన్నారు. స్థానిక ఐకేపీ కార్యాలయంలో మహిళా సంఘాల సభ్యుల సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్వయంశక్తి సంఘాల రుణాలను సకాలంలో చెల్లించిన సభ్యులకు ప్రత్యేక రుణాలు అందేవిధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. బ్యాంకు ద్వారా తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలన్నారు. ఇప్పటికే స్త్రీనిధి ద్వారా అర్హులైన సంఘ సభ్యులకు రుణాలను మంజూరు చేశామని పేర్కొన్నారు. రుణాల ద్వారా మహిళలకు మరింత జీవనోపాధి కలుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘాల సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

జీవో పునరుద్ధరణ చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న తూర్పుకాపు నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): తూర్పు కాపులకు స్థలాన్ని కేటాయిస్తూ ఇచ్చిన జీవోను పునరుద్ధరించాలని శ్రీకాకుళం జిల్లా తూర్పుకాపు సంఘం అధ్యక్షుడు కొండాల గణేష్, కార్యదర్శి పీఎస్ఆర్ నాయుడులు కోరారు. ఈ మేరకు బుధవారం అమరావతిలో రాష్ట్ర సచివాలయం వద్ద ఉన్నతాధికారులకు వినతిపత్రం అందించారు. బీసీ సంక్షేమ కార్యదర్శి సత్యనారాయణ, ఉప ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి వెంకటకృష్ణ, ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి సిసోడియాలని కలిసి విన్నవించారు. దీనికి వారు సానుకూలంగా స్పందించారని తెలిపారు.

చదువు.. సంస్కారం

- విలువలతో కూడిన విద్యపై చిన్నారులకు అవగాహన
- అహం బ్రహ్మాస్మి ఆధ్వర్యంలో 'సంస్కార సుధ' తరగతులు
- బాపూజీ కళామందిర్‌లో ఈ నెల 31 నుంచి రెండు రోజుల పాటు నిర్వహణ



విద్యార్థులు (ఫైల్)



ప్రత్యేక తరగతుల సమాచారం తెలియజేస్తున్న సంస్థ సిబ్బంది

శ్రీకాకుళం కల్చరల్ : ఇప్పుడంతా స్మార్ట్‌ఫోన్ యుగం. చిన్నారుల నుంచి పెద్దలు వరకు రోజంతా సెల్‌ఫోన్‌తోనే గడిపేస్తున్నారు. ఈ క్రమంలో కొంత మందిలో విలువలు దిగజారిపోతున్నాయి. చిన్నారుల్లో సైతం భాష, నడవడిక గాడి తప్పుతోంది. ఎంతసేపు ర్యాంకులు, బట్టీ చదువులు తప్ప ఎవరితో ఎలా మాట్లాడాలి.. పెద్దలతో ఎలా నడుచుకోవాలి.. ఇతరులను గౌరవించడం వంటి విషయాలు చెప్పే వారే కరువయ్యారు. ఈ నేపథ్యంలో చిన్నారుల్లో సంస్కృతి, సంప్రదాయలు, నైతిక విలువలు బోధించేందుకు శృంగేరిలోని శారదా పీఠం నడుం బిగించింది. అహం బ్రహ్మాస్మి అనే సంస్థను ఏర్పాటు చేసి పిల్లలకు, పెద్దలకు సనాతన ధర్మంపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఏడాది కాలంగా దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇప్పటికే వీరు శృంగేరిలో ఇంగ్లిష్, తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో సదస్సులు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్‌లోనూ సదస్సులు నిర్వహించి ఇక్కడి ప్రజలు, పిల్లల ఆలోచనా విధానంలో మార్పులు తెచ్చేందుకు శ్రీకాకుళం నుంచి అవగాహన తరగతులకు శ్రీకారం చుట్టారు. గుజరాతిపేటలోని శ్రీరాజ రాజేశ్వరీ లలీతా మహా త్రిపుర సుందరి దేవీ పీఠం సహకారంతో ఈ నెల 31(సాయంత్రం 5.30 నుంచి రాత్రి 8 గంటల వరకు), ఫిబ్రవరి 1(ఉదయం 10 నుంచి 12 గంటల వరకు) తేదీలలో బాపూజీ కళామందిర్ వేదికగా ఉచిత తరగతులు నిర్వహిస్తున్నారు.

పిల్లల కోసం 'సంస్కార సుధ'..

అహం బ్రహ్మాస్మి ఫౌండేషన్ ద్వారా వేదాంత శ్రవణం ప్రత్యేకంగా 8, 9, 10 తరగతులు చదువుతున్న విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని 'సంస్కార సుధ' పేరిట వారిలో సంస్కారాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తున్నారు. పెడదోవ పట్టిన ఆధునిక పోకడల మధ్య చాలామంది చిన్నారులు మన సనాతన ధర్మంలో వారి కర్తవ్యాలను విస్మరిస్తున్నారు. ఈ క్రమంలో సనాతన ధర్మంలో చెప్పిన నీతి నియమాలను ఏ విధంగా పాటించాలి, వాటి ద్వారా వచ్చే లాభాలు, భగవత్ అనుగ్రహం, సత్ప్రవర్తన, ఒత్తిడి తట్టుకోవడం వంటి అంశాలను చిన్నారులకు నేర్పనున్నారు. రెండు రోజుల తరగతుల్లో ఎంతవరకు అవగాహన పెంచుకున్నారో తెలుసుకునేందుకు చివరిలో ఒక పరీక్ష కూడా నిర్వహిస్తారు. ఇందుకోసం నగరంలోని పలు విద్యా సంస్థల నుంచి 300 మంది విద్యార్థులు పాల్గొనేలా నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

విద్యార్థులకు వరం



విద్యార్థులు ఎలా ఉండాలో తల్లిదండ్రులను, గురువులను ఎలా గౌరవించాలో, సమాజంలో నీతి నియమాలతో ఎలా నడుచుకోవాలో తెలియచేయడం వల్ల వారి భవిష్యత్తు వృద్ధి చెందుతుంది. తరగతులు నిర్వహించడం మంచి నిర్ణయం.

– పెంట వాశిష్ట కార్తికేయశర్మ, శ్రీరాజరాజేశ్వరీ లలితా త్రిపుర సుందరి దేవీ పీఠం, గుజరాతిపేట

నైతిక విలువలు అవసరం..



విద్యార్థులు నైతిక విలువలు పెంచుకోవాల్సిన అవసరం ఉంది. ఇటువంటి మంచి కార్యక్రమం నిర్వహించడం గొప్ప విషయం. నేను కూడా ప్రతి పాఠశాలకు వెళ్లి ఇటువంటి విషయాలపై అవగాహన తరగతులు నిర్వహిస్తున్నాను.

– నిష్టల నర్సింహమూర్తి, ప్రవచనకర్త, ఉపనిషన్మందిరం

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న సీఐ అవతారం

రణస్థలం: బ్యాంకింగ్ లావాదేవీలు, ఆన్‌లైన్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జే.ఆర్.పురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.అవతారం సూచించారు. మండల కేంద్రంలోని రామతీర్థాల కూడలిలో ఎస్‌బీఐ బ్యాంక్ సిబ్బంది ఆధ్వర్యంలో కళాకారుల బృందంతో ఆన్‌లైన్ మోసాలపై అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాద సమయంలో ఎలా అయితే 100, 108కు ఫోన్ చేస్తామో, అలాగే ఆన్‌లైన్, బ్యాంకింగ్ మోసాలు జరిగినట్లు గుర్తించిన ఒక గంటలోపు 1930 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. ఫోన్ చేసిన వెంటనే మీ బ్యాంకు లావాదేవీలు నిలిపి వేయడం జరుగుతుందని, తదుపరి నేరస్తులను పట్టుకునేందుకు మార్గం సుగమం అవుతుందని చెప్పారు. ప్రజలు తమ బ్యాంకింగ్ అకౌంట్ వివరాలు బహిర్గతం చేయవద్దని వివరించారు. ఎక్కువగా చదువుకున్న వాళ్లే సైబర్ నేరాల వలలో చిక్కుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జే.ఆర్.పురం ఎస్ఐ ఎస్.చిరంజీవి, ఎస్‌బీఐ బ్యాంకింగ్ సిబ్బంది ఉన్నారు.

ప్రాథమిక పాఠశాలను కొనసాగించాలి



ఎంపీడీవో హరిహరరావుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల ఎస్సీ కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను కొనసాగించాలని స్థానిక పెద్దలు, నాయకులు కోరారు. ఈ మేరకు ఎచ్చెర్ల ఎంపీడీవో సీపాన హరిహరరావుకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం కొత్తగా తీసుకొస్తున్న నిబంధనల మేరకు ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాల నుంచి 3, 4, 5 తరగతుల విద్యార్థులను వేరే పాఠశాలలో చేర్పించేందుకు విద్యాశాఖ అధికారులు సన్నద్ధం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా అయితే పాత జాతీయ రహదారి దాటి విద్యార్థులు పాఠశాలకు వెళ్లాల్సి ఉంటుందని, రోడ్డు దాటేటప్పుడు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందన్నారు. ఎస్సీ విద్యార్థులు ఎక్కువగా ఉన్న ఈ పాఠశాల కొనసాగించాలని విన్నవించారు. పాఠశాలలో తరగతులు మార్పు చేస్తే భవిష్యత్తులో ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు టి.లక్ష్మణరావు, మెండ రాజారావు, సూర్యారావు, జరుగుళ్ల భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణ రేపు

శ్రీకాకుళం రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ దివంగత ఎచ్చెర్ల వెంకట సూర్యనారాయణ విగ్రహావిష్కరణ మండల పరిధిలోని కిల్లిపాలెం గ్రామంలో శుక్రవారం నిర్వహించనున్నట్లు శ్రీకాకుళం జెడ్పీటీసీ రుప్ప దివ్య, ఎచ్చెర్ల శ్రీధర్‌లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి అన్ని పార్టీల నాయకులు హాజరవ్వాలని కోరారు.

యూనియన్ బ్యాంకు ప్రారంభం



బ్యాంకు శాఖ ప్రారంభిస్తున్న జోనల్ మేనేజర్ షాలిని మీనన్

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని రామలక్ష్మణ జంక్షన్ పరిధి కిల్లిపాలెంలో సరికొత్త హంగులతో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖను బుధవారం ప్రారంభించారు. జోనల్ మేనేజర్ షాలిని మీనన్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఖాతాదారులకు మరింత సౌకర్యవంతమైన సేవలు, వసతులను కల్పించాలనే ఉద్దేశంతో అన్ని సౌకర్యాలతో బ్యాంకును తీర్చిదిద్దినట్లు తెలిపారు. శ్రీకాకుళం ప్రాంతీయ కార్యాలయ రీజనల్ మేనేజర్ ఎం.వెంకట్‌తిలక్ మాట్లాడుతూ యూనియన్ బ్యాంక్ అందించే ఖాతాల ప్రాముఖ్యతను తెలుపుతూ, అన్ని రకాల రుణ సదుపాయాలను జిల్లాలో ఉన్న మొత్తం 43 శాఖల ద్వారా అందిస్తున్నట్లు పేర్కొన్నారు. బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

పేద విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

శ్రీకాకుళం అర్బన్: సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు 5 సైకిళ్లను బుధవారం పంపిణీ చేశారు. గార జెడ్పీహెచ్ స్కూల్ నుంచి పేద విద్యార్థులను ఎంపిక చేసి, శ్రీకాకుళంలోని ఎస్‌బీఐ రీజనల్ కార్యాలయ ఆవరణలో ఐదు సైకిళ్లను అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ అబ్దుల్ అమీర్ హసీఫ్ తదితరులు పాల్గొన్నారు.

పరికరాల వితరణ

శ్రీకాకుళం: జిల్లా కేంద్రంలోని బలగ వద్దనున్న సర్వజన ప్రభుత్వ ఆస్పత్రి (రిమ్స్)లో ఉన్న బ్లడ్ బ్యాంక్‌తో పాటు పలు విభాగాలకు అవసరమయ్యే సుమారు రూ.10 లక్షల విలువ చేసే పరికరాలను యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సౌజన్యంతో సమకూర్చినట్లు ఆ బ్యాంక్ విశాఖపట్నం జనరల్ మేనేజర్ షాలిని మీనన్ తెలిపారు. కార్యక్రమంలో యూనియర్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ హెడ్ ఎం.వెంకట్ తిలక్ తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో బలపడాలి

ఎచ్చెర్ల క్యాంపస్: జిల్లాలోని స్వయం సహాయక సంఘాలు క్షేత్రస్థాయిలో బలపడాలని వెలుగు సంస్థాగత నిర్మాణం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ మోహన్‌రావు అన్నారు. ఎచ్చెర్లలోని సాంకేతిక శిక్షణ కేంద్రంలో రెండు రోజులుగా కమ్యూనిటీ ఆర్గనైజేషన్ సిబ్బందికి ఖాతాలు నిర్వహణపై చేపడుతున్న శిక్షణ బుధవారంతో ముగిసింది. కార్యక్రమంలో వెలుగు కో–ఆర్డినేటర్లు, ఏపీఎంలు పాల్గొన్నారు.

చెస్‌లో బంగారు పతకం కైవసం

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా చెస్ క్రీడాకారిణి బి.శృతి సరికొత్త చరిత్ర లిఖించింది. ఈనెల 21 నుంచి 24 వరకు మహారాష్ట్రలోని నాందేడ్ వేదికగా జరిగిన ఆలిండియా స్కూల్‌గేమ్స్ అండర్–14 చెస్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో, బాలికల విభాగంలో బంగారు పతకం సాధించి శభాష్ అనిపించుకుంది.

డేటా నమోదులో మార్పులకు అవకాశం

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలోని అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల టీఐఎస్(ఈఐఎస్) నమోదు సమయంలో తలెత్తిన తప్పులు, దోషాల మార్పులకు ఈనెల 31వ తేదీ వరకు అవకాశం ఉందని డీఈవో డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య తెలిపారు. ఆరోజు సాయంత్రంలోపు మార్పులు చేసుకోవాలన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): భారత విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు ప్రజ్ఞా వికాస్ పరీక్ష జిల్లావ్యాప్తంగా ఫిబ్రవరి 11, 12, 13 తేదీల్లో అన్ని మండలాల్లో నిర్వహించనున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.పవిత్ర, డి.చందు, జిల్లా కమిటీ సభ్యులు చెన్నారావు తెలిపారు. ఈ మేరకు సీపీఎం కార్యాలయంలో బుధవారం పోస్టర్ ఆవిష్కరించారు.

పాఠశాలలు కొనసాగించాలి

శ్రీకాకుళం న్యూకాలనీ: ఉన్నతీకరణకు నోచుకోని ప్రాథమికోన్నత (యూపీ) పాఠశాలలను కొనసాగించాలని ఆంధ్రప్రదేశ్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ (ఏపీ ఎస్టీఏ) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సప్పటి మల్లేసు, పంచాది గోవిందరాజులు ప్రభుత్వానికి ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

నేటి నుంచి డిగ్రీ మూల్యాంకనం

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ(అటానమస్) కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం జవాబు పత్రాల మూల్యాంకనం గురువారం నుంచి ప్రారంభమవుతుందని ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు బుధవారం తెలిపారు.

కొట్లాట కేసు నమోదు

ఎచ్చెర్ల క్యాంపస్: అల్లినగరం గ్రామానికి చెందిన ఎండ్ల రాజబాబు ఫిర్యాదు మేరకు ఎచ్చెర్ల పోలీసులు బుధవారం నలుగురిపై కొట్లాట కేసు నమోదు చేశారు. గ్రామంలో మంగళవారం రాత్రి కొట్లాట జరగ్గా, బాధితులు శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. ఆస్పత్రి వర్గాలు అందజేసిన ఆరోగ్య నివేదిక ఆధారంగా బాధితుని ఫిర్యాదు మేరకు కంచి రాముతో పాటు మరో ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పాతకక్షల నేపథ్యంలో దాడి జరిగినట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు.

క్యాంపస్ డ్రైవ్‌లో 51 మంది ఎంపిక

శ్రీకాకుళం న్యూకాలనీ: నగరంలోని ఆర్ట్స్ కాలేజీ రోడ్డులో ఉన్న కాకినాడ శ్రీఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. బెంగళూరుకు చెందిన ఐఎల్ఎం నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో రికార్డు స్థాయిలో 51 మంది ఎంపికయ్యారు. వీరికి ఏడాదికి రూ.2.5 లక్షల వార్షిక వేతనం లభించనుంది. కాగా ఎంపికైన విద్యార్థులను విద్యాసంస్థల జిల్లా డైరెక్టర్ బీఎస్ చక్రవర్తి, ప్రిన్సిపాల్ ఎన్.వి.వేణుగోపాల్ బుధవారం అభినందించారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

శ్రీకాకుళం క్రైమ్: గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ సీఐ పి.ఈశ్వరరావు సూచించారు. నగరంలోని ఒక ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు.

యువతే దేశ భవిష్యత్

ఎచ్చెర్ల క్యాంపస్: యువతే దేశ భవిష్యత్ అని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. చిలకపాలేంలోని శ్రీశివానీ ఇంజినీరింగ్ కాలేజీలో భారత ప్రభుత్వ యువజన సర్వీసుల శాఖ, నెహ్రూ యువ కేంద్రం నిర్వహిస్తున్న అంతర జిల్లా యువత శిక్షణ కార్యక్రమం (కర్నూలు యువతకు)లో రెండో రోజు బుధవారం పాల్గొన్నారు. యువత స్వామీ వివేకనందాను ఆదర్శంగా తీసుకోవాలని చెప్పారు. ఆయనతో పాటు రిసోర్సు పర్సన్లు, శివానీ కళాశాల యాజమాన్య ప్రతినిధులు ఉన్నారు.

విత్తన క్షేత్రాలకు ప్రాధాన్యమివ్వాలి

ఎచ్చెర్ల క్యాంపస్: గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయంలో విత్తన ఉత్పత్తి క్షేత్రాలకు రైతులు ప్రాధాన్యమివ్వాలని ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు ఇన్‌చార్జి రజిని అన్నారు. జరజాం పంచాయతీ గొలివివానిపేటలో బుధవారం సీడ్ ప్లాంటేషన్ కార్యక్రమం నిర్వహించారు.

రోడ్డు ప్రమాదాలపై అవగాహన

ఎచ్చెర్ల క్యాంపస్: రోడ్డు ప్రమాదాల నియంత్రణలో వాహన చోదకుల పాత్ర కీలకమని బీఆర్ఏయూ వీసీ కేఆర్ రజిని అన్నారు. వర్సిటీలో రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా బుధవారం జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.కార్యక్రమంలో ఎచ్చెర్ల ఎస్ఐ వి.సందీప్‌కుమార్ పాల్గొన్నారు.

తల్లిదండ్రుల తీర్మానం తీసుకోవాలి

శ్రీకాకుళం న్యూకాలనీ: ఒక పంచాయతీలో ఒకటి కూడా మోడల్ ప్రైమరీ పాఠశాల చేసేందుకు పూర్తిగా వీలుకాని పక్షంలో తప్పనిసరి పరిస్థితుల్లో విద్యార్థులను సమీప పాఠశాలల్లో మ్యాపింగ్ చేయాల్సి వస్తే, తల్లిదండ్రుల కమిటీ తీర్మానం ఆమోదం తీసుకోవాలని ఉత్తర్వులు స్పష్టం చేస్తున్నాయని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రమణ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కానీ అధికారులు మాత్రం తల్లిదండ్రుల కమిటీల తీర్మానాన్ని పక్కనపెట్టి విద్యార్థుల మ్యాపింగ్ చేస్తున్నారన్నారు. ఇది నిబంధనలను ఉల్లంఘించడమేనని పేర్కొన్నారు. ఐదో తరగతి లోపు 60 మంది పిల్లలున్న పాఠశాలల్లో పంచాయతీకి ఒక మోడల్ ప్రైమరీ పాఠశాలలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

జంగిల్ క్లియరెన్స్



చిలకపాలేం – రాజాం ప్రధాన రహదారికి ఇరువైపుల పేరుకుపోయిన జంగిల్ క్లియరెన్స్ పనులను రోడ్లు, భవనాల జేఈఈ పీటీ రాజు ఆధ్వర్యంలో బుధవారం చేపట్టారు. ఈనెల 27న కలెక్టర్ నిర్వహించిన గ్రీవెన్స్ సెల్‌లో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పేడాడ శ్రీరామమూర్తి ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు పొందూరు వంతెన నుంచి పాలఖండ్యాం వరకు పనులను చేపట్టారు. దీంతో ప్రజలు, ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

– జి.సిగడాం

మరమ్మతులు



లావేరు మండలంలోని మురపాక గ్రామంలో మంచినీటి సరఫరా పైపులైన్ పాడవ్వడంతో కుళాయిల ద్వారా నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో స్థానిక సర్పంచ్ పెయ్యిల నాగమణి ఆధ్వర్యంలో పైపులైన్ల మరమ్మతులు బుధవారం చేపట్టారు. త్వరితగతిన మరమ్మతులు పూర్తిచేసి, తాగునీరు అందించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

– ఎచ్చెర్ల

సూర్య నమస్కారాలు



ఎచ్చెర్ల మండలంలోని ముద్దాడ గ్రామ బీసీ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బుధవారం సూర్య నమస్కారాలు చేశారు. హెచ్ఎం తమ్మినేని నారాయణరావు, ఉపాధ్యాయులు కె.కొండయ్య, బి.భవానీ విద్యార్థులకు రథ సప్తమి ప్రాధాన్యం, సూర్య నమస్కారాల వలన కలిగే ప్రయోజనాలు వివరించారు.

– ఎచ్చెర్ల క్యాంపస్

బాలికల లింగ నిష్పత్తి పెరగాలి



దత్తత పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: బాలికల లింగ నిష్పత్తి పెరగాల్సిన అవసరం ఉందని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. మహిళ, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో కోడి రామ్మూర్తి స్టేడియం వద్దనున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కళా వేదికలో బేటీ బచావో, బేటీ పడావో కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భ్రూణ హత్యలు అరికట్టాలని, బాలికలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు. మహిళ, శిశు సంక్షేమ శాఖ పీడీ బి.శాంతిశ్రీ మాట్లాడుతూ లింగ వివక్ష, మహిళా సాధికారత గురించి ఆందోళనలు పరిష్కరించడానికి భారత ప్రభుత్వం బేటీ బచావో, బేటీ పడావో పథకాన్ని తీసుకొచ్చిందన్నారు. అనంతరం పిల్లల దత్తత పోస్టర్‌ను ఆవిష్కరించారు. అలాగే వివిధ క్రీడల్లో ప్రతిభ కనబర్చిన బాలికలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ బాలమురళీకృష్ణ, జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య, సమగ్ర శిక్ష ఏపీసీ డాక్టర్ సంపతిరావు శశిభూషణ్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ వెంకటరావు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ శ్రీలక్ష్మి, సభ్యులు ఎం.గన్నప్పడు, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

31న సత్యసాయి సెంట్రల్ మేనేజింగ్ ట్రస్టీ పర్యటన



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణరావు తదితరులు

శ్రీకాకుళం కల్చరల్: సత్యసాయి సెంట్రల్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జె.రత్నాకర్ ఈ నెల 31న జిల్లాలో పర్యటించనున్నట్లు సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం జిల్లా కేంద్రంలోని పెద్దమందిరంలో కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాలలో భాగంగా యువతలో నైపుణ్యాలను పెంపొందించాలనే ఉద్దేశంతో శ్రీకాకుళం సత్యసాయి సేవా సమితి బ్యాంకర్స్ కాలనీలో 31న 'బెడ్ సైడ్ అసిస్టెంట్' ఉచిత శిక్షణ కోర్సు ప్రారంభానికి ఆయన హాజరవుతారని పేర్కొన్నారు. అనంతరం పలాసలోని రామకృష్ణాపురంలో సత్యసాయి విద్యా విహార్‌లో నూతన భవన సముదాయం ప్రారంభిస్తారని తెలిపారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు సూర రామచంద్రరావు, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌చార్జి బోయిన నరసింహమూర్తి, జిల్లా సేవాదళ్ సమన్వయకర్త పప్పల నాగేశ్వరరావు, జోనల్ కన్వీనర్ శివన్నారాయణ, బ్యాంకర్స్ కాలనీ మందిరం కన్వీనర్ ప్రసాదరావు, పెద్దమందిరం కన్వీనర్ కె.మురళీకృష్ణ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో నియామకాలు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)/ఎచ్చెర్ల క్యాంపస్: వైఎస్సార్‌సీపీ శ్రీకాకుళం, ఎచ్చెర్ల నియోజకవర్గాల అనుబంధ విభాగాల అధ్యక్షులను ఆ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

శ్రీకాకుళం నియోజకవర్గం...

అనుబంధ విభాగం	అధ్యక్షుడి పేరు
యువజన విభాగం	గుండ హరీష్
మహిళావిభాగం	మూకళ్ల సుగుణ
రైతు విభాగం	పీస శ్రీహరి
బీసీ సెల్	మెండ శాస్త్రి
ఎస్సీసెల్	యజ్జల గురుమూర్తి
మైనార్టీ సెల్	ఎం.ముజిబూర్ రెహ్మన్
క్రిస్టియన్ మైనార్టీ సెల్	రాణా గురయ్య
విద్యార్థి విభాగం	ఇషాక్‌హుషేన్
పంచాయతీరాజ్ విభాగం	సూరాడ సూర్యం
మున్సిపల్ విభాగం	కింజరాపు రమేష్
ఆర్టీఐ విభాగం	ఎండ రమేష్
గ్రీవెన్స్ సెల్	శీర సత్యనారాయణ
వాణిజ్య విభాగం	కిల్లంశెట్టి అరుణ్‌కుమార్‌గుప్తా
వీవర్స్ వింగ్	కొండపాల అన్నాజీరావు
వైఎస్సార్ టీయూసీ	బరాటం నాగరాజు
అంగన్‌వాడీ విభాగం	దుండు శ్రావణి
లీగల్ సెల్	గొండు నీలాద్రి
కల్చరల్ విభాగం	మండవల్లి రవి
సోషల్ మీడియా విభాగం	శ్రీరాములు వి.వి.మూర్తి
ఐటీ విభాగం	నందూరి చందు
దివ్యాంగుల విభాగం	రుప్ప శ్రీనివాసరావు
డాక్టర్స్ విభాగం	డాక్టర్ శ్రీనివాస పట్నాయక్
పబ్లిసిటీ విభాగం	ద్వారపు అజిత్‌కుమార్
బూత్ కమిటీ విభాగం	భైరి మురళీధర్
ఇంటలెక్ట్యువల్స్ ఫోరం	బుడ్డ యర్రన్న

ఎచ్చెర్ల నియోజకవర్గం...

యూత్ వింగ్	దన్నాన హరి
మహిళా విభాగం	గురన తిరుమల మానస
రైతు విభాగం	చిలకపల్లి పరందామయ్య
బీసీ సెల్	మజ్జి రమేష్
ఎస్సీ సెల్	నేతల కృష్ణ
ఎస్టీ సెల్	తార అప్పలరాజు
మైనారిటీ సెల్	షేక్ సైదులు
క్రిస్టియన్ మైనారిటీ సెల్	టంపోల పేతురు
స్టూడెంట్ వింగ్	ముద్దాడ రాజశేఖర్
పంచాయతీరాజ్ వింగ్	తిరుమలరెడ్డి గౌరీ శంకర్‌రావు
ఆర్టీఐ వింగ్	వేలిడి సాయిరాం
వలంటీర్స్ వింగ్	చందక సతీష్
గ్రీవెన్స్ సెల్	ఈసర్ల గోవిందరావు
వాణిజ్య విభాగం	బోర గోవిందరెడ్డి
వీవర్స్ వింగ్	నక్కిన అసిరప్పడు
వైఎస్సార్ టీయూసీ	చిక్కాల ధర్మారావు
అంగన్‌వాడీ వింగ్	అంబటి సుజాత
లీగర్ సెల్	కోటి పాత్రుణి శివ కుమార్
కల్చరల్ వింగ్	అలుపాన నారాయణరెడ్డి
సోషల్ మీడియా వింగ్	గవిరెడ్డి రవికుమార్
ఐటీ వింగ్	చిత్తికి మోహనరావు
దివ్యాంగుల విభాగం	మహంతి రామసత్యం
డాక్టర్స్ వింగ్	దుర్గాసి రామారావు
ఇంటలెక్ట్యువల్స్ ఫోరం	పైడి శ్రీనివాసరావు
బూత్ కమిటీ	మీసాల శ్రీనివాసరావు
పబ్లిసిటీ వింగ్	బాకి సూర్యనారాయణరెడ్డి